ముక్కోటి ఏకాదశికి ముస్తాబవుతున్న ఆలయాలు

సీతానగరం: వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలో ఆలయాలు ముస్తాబవుతున్నాయి. గ్రామాలోని ఆలయాల వద్ద ఆయా కమిటీల ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. వంగలపూడి సీతారామ స్వామి ఆలయం, రఘుదేవపురంలో శ్రీదాసాంజనేయ స్వామి ఆలయాలు విద్యుద్దీపాలంకరణలో తొమ్మిది రోజులు ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీలు తగు చర్యలు తీసుకున్నాయి. వంగలపూడి సీతారామస్వామి ఆలయం వద్ద సోమవారం ఏకాహం కార్యక్రమం, 3న సత్యహరిశ్చంద్ర నాటకం, 4న సినీ మ్యూజికల్ నైట్, 5న కూచిపూడి, జానపద నృత్యం, రింగ్ డ్యాన్స్, 6న శ్రీరామాంజనేయ యుద్ధం, బాల నాగమ్మ (మాయల ఫకీర్ సీను), 7న శ్రీపద్మావతి శ్రీనివాస కల్యాణం, వెంకటేశ్వర గానామృతం, 8న, సినీ సంగీత విభావరి, 10న అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ముక్కోటి ఉత్సవ కమిటీ తెలిపింది.

రఘుదేవపురంలో : శ్రీదాసాంజనేయ స్వామి ఆలయం వద్ద ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఏకాహం, 3న హరికథ, 4న బుర్రకథ, 5న కోలాటం నృత్య ప్రదర్శన, 6న మిమిక్రీ, మ్యాజిక్ షో, క్లాసికల్ రింగ్ డ్యాన్స్, 7న అన్నమయ్య నృత్య రూపకం, 8న బుర్రకథ, 9న భక్త రంజని, 11న శ్రీస్వామి వారి ఊరేగింపు, 12న అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందని ఉత్సవ కమిటి తెలిపింది.


రఘుదేవపురంలో ముక్కోటికి ముస్తాబవుతున్న దాసాంజనేయ స్వామి ఆలయం



పిట్ట కొంచెం.. కూత ఘనం

- జ్ఞాపకశక్తితో అబ్బుర పరుస్తున్న చిన్నారి 'దరహాస్'
- ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 2022లో చోటు
- చిన్నారికి జీబీఆర్ సంస్థల కరస్పాండెంట్ కొండబాబు ప్రశంస


చిన్నారి దరహాస్‌ను అభినందిస్తున్న జీబీఆర్ సంస్థల కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి తదితరులు

అనపర్తి: ఆ బాలుడి వయస్సు మూడేళ్ల ఎనిమిది మాసాలు. అయితేనేమి అద్భుతమైన జ్ఞాపకశక్తితో చూసే వారిని అబ్బుర పరుస్తున్నాడు. ఆ చిన్నారి జ్ఞాపకశక్తిని చూసిన వారు పిట్ట కొంచెం.. కూత ఘనం అన్న సామెతను గుర్తుకు చేసుకుంటున్నారు. చిన్నారి ప్రతిభను చూసిన పలువురు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

అనపర్తికి చెందిన రామకిషోర్, జ్యోత్స్నాదేవి దంపతుల కుమారుడు దరహాస్ వెంకట సాయి తన ప్రతిభతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 2022లో నవంబరు 22న చోటు దక్కించుకున్నాడు. స్థానిక జీబీఆర్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్న దరహాస్ వెంకటసాయి ప్రపంచంలోని 64 దేశాల రాజధానుల పేర్లను కేవలం 2 నిమిషాల 34 సెకన్లలో చెప్పి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేస్తున్నాడు. దేశంలోని 28 రాష్ట్రాల రాజధానుల పేర్లను, ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాల రాజధానుల పేర్లను కేవలం 53 సెకండ్లలో చెప్పి అప్రకటితంగానే వీక్షకులతో ఔరా..అనిపిస్తున్నాడు. వీటితో పాటు 75 ముక్కలుగా చింపిన ప్రపంచ పటాన్ని, 24 భాగాలుగా చేసిన ఇండియా మ్యాప్‌ను అతి తక్కువ సమయంలో అతికించడం అందరినీ అబ్బుర పరుస్తుంది. తన అమోఘమైన జ్ఞాపకశక్తితో దరహాస్ కనబరుస్తున్న ప్రతిభా పాటవాలకు చూసిన వారు మంత్రముగ్ధులవుతువున్నారు. చిన్నారి ప్రతిభా పాటవాలకు జీబీఆర్ విద్యా సంస్థల చైర్మన్ తేతలి ఆదిరెడ్డి(కొండబాబు) ముగ్ధులై చిన్నారికి రూ.5 వేల నగదు బహుమతిని శని వారం అందజేశారు. దరహాస్‌ను జీబీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డీన్ హరిప్రసాద్, ప్రీ ఏసీ క్యాంపస్ ఇన్‌చార్జ్ ప్రశాంతి, ఏవో ఆచారి తదితరులు చిన్నారి దరహాస్‌తో పాటు తల్లిదండ్రులను అభినందించారు.



కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు


ఊలపల్లిలో అదనపు తరగతి గదుల పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మనబడి నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ఊలపల్లిలో శనివారం మనబడి నాడు–నేడు పథకంలో రూ.26 లక్షలతో నిర్మించనున్న ఎంపీపీ స్కూల్ రెండు తరగతి భవనాలకు రూ.12 లక్షలతో చేపట్టే వివిధ మౌలిక సదుపాయాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం 15వ ఆర్థిక సంఘం నిధులతో ఏర్పాటు చేసిన జల్లు స్నానఘట్టాన్ని ప్రారంభించి అనంతరం స్థానిక జగనన్న కాలనీలో రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుదీకరణను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని దీనిని దృష్టిలో ఉంచుకుని జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు జి.వి జయశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, సర్పంచ్ బండారు రమ్య, ఎంపీటీసీ బండారు శివ, విద్యాకమిటీ చైర్మన్ డి.భవాని తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగు నీరు అందించాలనే లక్ష్యంతో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వేంద్ర గ్రామంలో శనివారం జలజీవన్ మిషన్ నిధులు రూ.29.54 లక్షలతో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్, సంపరలో నాడు నేడు పథకంలో రూ.41.75 లక్షలతో చేపట్టే పాఠశాల భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలకు వేసవిలో తాగునీరు ఎద్దడి లేకుండా ముందస్తుగా ప్రణాళికలు రూపొందించి ప్రజలకు తాగునీరు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, సంపర సర్పంచి అద్దంకి మాచరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ఆదినారాయణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నర్ల సాంబమూర్తి, సొసైటీ డైరెక్టర్ పేపకాయల సూర్యనారాయణ, మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, గ్రామ కన్వీనర్ యెరుబండి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.













క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ


బూరుగుపూడిలో క్యాలెండర్ ఆవిష్కరించిన నాయకులు

మధురపూడి: బూరుగుపూడి పీఏసీఎస్ చైర్‌పర్సన్ బుడ్డిగ సత్తిబాబు ఆధ్వర్యంలో శనివారం 2023 సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా రాజానగరం నియోజకవర్గం ఏఎంసీ చైర్ పర్సన్ నక్కా రాంబాబు హాజరయ్యి మాట్లాడుతూ బూరుగుపూడి పీఏసీఎస్ ప్రతి సంవత్సరం నూతన సంవత్సరం సందర్భంగా క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. బూరుగుపూడి, గుమ్ములూరుతో పాటు, పలు గ్రామాల ప్రజలకు అందించడమే కాకుండా, డైరీలను అధికారులు, ప్రజా ప్రతినిధులకు అందజేయడం విశేషమన్నారు. సంస్థ ఏర్పాటు, నిర్వాహణలో దివంగత బూరుగుపూడి మాజీ సర్పంచ్ క్రొవ్విడి సూర్యనారాయణ మూర్తి అందరికీ బాటలు వేశారన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి కోరుకొండ మండలం చైర్మేన్ క్రొవ్విడి సత్రాజు, పీఏసీఎస్ చైర్ పర్సన్ బుడ్డిగ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మేకా రాజు, కంటే సత్తిబాబు, పిట్టా కృష్ణ, ఏవీఎస్ఎస్ మూర్తి, సంస్థ పర్సన్లు అడపా రామకృష్ణ, ఈర్ల గంగేశ్వరుడు తదితరలు పాల్గొన్నారు.








బిర్యానీ సెంటర్లకు గిరాకీ


సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బిర్యానీ సెంటర్లు

సీతానగరం: ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా గ్రామాల్లో వెలసిన బిర్యానీ సెంటర్లకు గిరాకీ పెరిగింది. శనివారం సాయంత్రం 4 గంటల నుంచే అమ్మకాలు మొదలయ్యాయి. పురుషోత్తపట్నం ఏటిగట్టుపైన, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరం నాలుగు బొమ్మల సెంటర్, బస్టాండ్ సెంటర్, రఘుదేవపురం సెంటర్, ముగ్గళ్ళ, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి, మునికూడలి, కాటవరం, బొబ్బిల్లంకలలో టెంట్లు వేసి అందులో ఏర్పాటు చేసిన బిర్యానీ దుకాణాల్లో ఘుమఘుమలాడే వివిధ రకాలైన మాంసాహార వంటకాలు అమ్మకాలను సిద్ధం చేశారు. నోరూరించేలా వివిధ రకాలైన చికెన్, మటన్, రొయ్య, పీతల వంటకాలు అమ్మకాలు జరిపారు. బిర్యానీ ప్యాకెట్ ధర రూ.50 నుంచి రూ.150 వరకూ పలు ఆఫర్‌లతో అమ్మకాలు జరిపారు. రెండు బిర్యానీ ప్యాకెట్లు కొంటే ఒకటి ఉచితం, ఈ ఆఫర్లతో కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నారు. అలాగే కూల్‌డ్రింక్స్ బాటిల్స్, కేక్స్, ఫ్రూట్స్ ధరలు పెరిగాయి. స్థానిక ఎస్సై కె.శుభశేఖర్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు చేపట్టారు.







క్లుప్తంగా

ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



ఎమ్మెల్యే దంపతులకు నోట్‌బుక్స్ అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అంగన్‌వాడీ వర్కర్లు

అనపర్తి: 2023 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండలంలోని రామవరం పంచాయతీ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, వలంటీర్లు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులను కలసి ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రామవరం ఉపసర్పంచి సబ్బెళ్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వారు ఎమ్మెల్యే దంపతులు ఏర్పాటు చేసిన వైఎస్సార్ పుస్తక నిధికి 800 నోట్ బుక్స్ అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, రామవరం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, వలంటీర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వినూత్న శుభాకాంక్షలు



ఆర్టిస్టు గోపాలకృష్ణయ్య రూపొందించిన నూతన సంవత్సర చిత్రం

బిక్కవోలు: 2022వ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2023 సంవత్సరానికి స్వాగతం చెబుతూ బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ ఆర్టిస్టు రామవరపు గోపాలకృష్ణయ్య శనివారం చక్కని చిత్రాన్ని రూపొందించారు. నూతన సంవత్సరంలో ప్రజలందరి జీవితాలు సుఖసంతోషాలతో గుర్రం పరుగులా సాగాలని ఆకాంక్షిస్తూ... కొత్త ఏడాది మనిషి ఆకారంగా... అతని చేతి నుంచి దూసుకొస్తున్న 2023 సంవత్సరాన్ని గుర్రంలా ఆయన ఈ చిత్రాన్ని రూపొందించి ఈ చిత్రం ద్వారా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలపై నిరసన

రంగంపేట: ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లో హిందూమతంపై అనుచిత వ్యాఖ్యలు, దాడులకు నిరసనగా మండలంలోని హిందువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వారు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం తెలంగాణలోని బైరి నరేష్ హిందూ దేవుళ్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసన వ్యక్తం చేశారు. బైరి నరేష్‌పై పీడీ యాక్ట్ నమోదు చేసి, రానున్న రోజుల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సమరసతా సేవా సమితి మండల కన్వీనర్ మండవిల్లి గుప్తా, సహ కన్వీనర్ ప్రసాద్, మణికంఠ క్షేత్రం గురుస్వామి అర్జునరావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలుకుదాం



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పెంపులో భాగంగా ఈ నెల మూడో తేదీన రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరంలో జరిగే బహిరంగ సభకు విచ్చేయనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలుకుదామని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ చైర్మన్ మజ్జి అప్పారావు పిలుపునిచ్చారు. శనివారం 31వ డివిజన్ మధన్‌సింగ్‌పేటలో డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ మజ్జి నూకరత్నం ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నగరంలో ఆజాద్‌చౌక్ మీదుగా సీఎం పర్యటను సాగుతుందని, ఆయనకు ఘనంగా స్వాగతం పలకాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు లంక సత్యనారాయణ, నల్లా రామాంజనేయులు, శ్రీను, షైక్ బాబ్జి, కుమార్ పాల్గొన్నారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ వితరణ

కంబాలచెరువు: నగరానికి చెందిన వర్తకుల స్వచ్ఛంద సేవా సంస్థ చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ లాలాచెరువు ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం దాదాపు రూ.48 వేలు విలువ గల 10 కుర్చీలు, 10 టేబుల్స్‌ను శనివారం వితరణ చేశారు. పాఠశాల విద్యకు సహాయం అందించడంలో తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందని ట్రస్ట్ ఉపాధ్యక్షుడు ముద్దుల మురళీకృష్ణ తెలిపారు. కుర్చీలు, టేబుల్స్‌ను ప్రధానోపాధ్యాయులు ఎ.మల్లేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా, సహాయ కార్యదర్శి దేవత సుధాకర్, ట్రస్ట్ డైరెక్టర్ లక్కోజు వీరభద్రరావు, సభ్యులు సీతారామాంజనేయులు, ఉపాధ్యాయులు బి.రాజేందర్, సరితా రంజని, బి.నాగేశ్వరరావు, ఎస్.రవి కిశోర్ పాల్గొన్నారు.

కొంగొత్త ఆశలతో.. కొత్త ఏడాదికి స్వాగతం

అనపర్తి: ఆంగ్ల నూతన సంవత్సర ప్రారంభమైన వేళ సంబరాలు అంబరాన్నంటాయి. ఎన్నో వినోదాలు.. మరెన్నో విషాదాలు.. మరిచిపోలేని మధురానుభూతులను మిగిల్చిన 2022 సంవత్సరానికి అనపర్తి నియోజకవర్గ ప్రజలు హృద్యంగా వీడ్కోలు పలికారు. కోటి ఆశలతో ఆనందోత్సాహాల నడుమ శనివారం అర్ధరాత్రి 12 గంటలకు 2023కి ఆత్మీయ స్వాగతం పలికారు. అర్ధరాత్రి దాటే దాకా గ్రామాల్లో ఒకటే సందడి. యువత కేరింతలు, బాణసంచా పేలుళ్లు, ఇంటి వాకిళ్ల ముందు రంగురంగుల రంగవల్లులు, కొంగొత్త ఆశల నడుమ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా గ్రామాల్లో ఎక్కడ చేసినా పండగ వాతావరణం కనిపించింది. 2022 సంవత్సరం మిగిల్చిన జ్ఞాపకాలు గుండెల్లో పదిలపరుచుకుని ఈ కొత్త ఏడాదిలో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకొంటూ 2023ని స్వాగతించారు. వయసుతో నిమిత్తం లేకుండా చిన్న పెద్దా గ్రామాల్లో తిరుగుతూ ఎదుటపడిన ప్రతి ఒక్కరూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ, పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ మహిళలు ఇళ్ల ముంగిట రంగు రంగుల హరివిల్లులతో ఆకర్షణీయంగా అలంకరించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ప్రార్థనా మందిరాల్లో అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

బేకరీలు.. బిజీబిజీ

మండలంలోని అన్ని గ్రామాల్లో నూతన సంవత్సరాన్ని స్వాగతించే దిశగా యువత సోమవారం సాయంత్రం నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అనపర్తిలో మెయిన్‌రోడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫ్లవర్స్, బొకే స్టాల్స్, మెయిన్ రోడ్డులోని స్వీట్స్, బేకరీలు, పండ్లు దుకాణాల వద్ద నూతన సంవత్సర సందడి కనిపించింది. నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ తయారు చేసిన కేకులు కొనుగోలు చేసేందుకు ప్రజలు మొగ్గు చూపుతూ బేకరీలకు ఆర్డర్లు ఇచ్చారు. దీంతో బేకరీలన్నీ బిజీ అయ్యాయి. ఈ సందర్భంగా వివిధ రూపాల్లో తయారు చేసిన పలు రకాల కేక్‌లు ఆకట్టుకున్నాయి. చాక్లెట్, పైనాపిల్, స్ట్రాబెర్రీ, వెనీలా, బటర్‌స్కాచ్ బ్లాక్ ఫ్లేవర్ తదితర ఫ్లేవర్స్‌తో కూడిన కేకులు విక్రయించేందుకు కొనుగోలుదారులు ముఖ్యంగా యువత మొగ్గు చేపారని బేకరీ నిర్వాహకులు తెలిపారు.



అనపర్తిలో ఆకర్షిస్తున్న బొకేలు



అనపర్తి బెంగళూరు అయ్యంగార్ బేకరీలో తయారు చేసిన న్యూ ఇయర్ కేక్‌లు



అమ్మకానికి సిద్ధం చేసిన పండ్లు



అనపర్తి బేకరీలో భారీ న్యూ ఇయర్ కేక్

ఆకర్షించిన పూలబొకేలు...

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక కెనాల్‌రోడ్డు, మెయిన్‌రోడ్డులో గల పూల దుకాణాల్లో వివిధ రకాల పూలతో, వివిధ ఆకృతుల్లో ఏర్పాటు చేసిన బొకేలు, పుష్పగుచ్ఛాలు కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నాయి.

మార్కెట్‌లో న్యూ ఇయర్ సందడి

రాజానగరం: కొత్త సంవత్సరం ఉత్సాహం జనంలో ఎక్కువగానే ఉంది. కరోనా వైరస్ ప్రభావంతో రెండు సంవత్సరాలుగా వేడుకలకు దూరంగా ఉన్న ప్రజలు ప్రస్తుతం సరదాలు, సంబరాలతో సంతోషంగా గుడుపుతున్నారు. పలు సెంటర్లలో స్పెషల్ బిర్యానీ పాయింట్స్ వెలిశాయి. కొనుగోలుదార్లను ఆకర్షించే రీతిలో ఆఫర్లు పెట్టడంతో రద్దీగా మారాయి. మద్యం దుకాణాలలో ధరలు మామూలుగానే ఉండగా బిర్యానీ పాయింట్లలో ప్యాకెట్లకు కూల్ డ్రింక్ బాటిల్స్ ఆఫర్లు ఇస్తున్నారు. ఇక పూల దండలు, బొకేల కోసం పూల దుకాణాలు, స్వీట్ స్టాల్స్ సంగతి చెప్పనక్కరలేదు, జనంతో కిటకిటలాడిపోతున్నాయి. వాకిళ్లలో న్యూ ఇయర్ శుభాకాంక్షలతో ముగ్గులు వేసేందుకు అవసరమైన రంగులు, గ్రీటింగ్‌లు విక్రయించే స్టాల్స్ కూడా తామే ఏ మాత్రం తీసిపోలేదన్నట్టుగా కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి.

నూతన సంవత్సరానికి వినూత్న స్వాగతం



2023 ఆకృతిలో కూర్చుని కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

అనపర్తి: నూతన సంవత్సరం అనగానే కొందరు వినూత్నంగా ఆలోచన చేస్తూ కొత్త ఏడాదికి కోటి ఆశలతో కొంగొత్తగా స్వాగతం పలుకుతారు. ఈ తరహాలోనే ఆలోచన చేసిన మండలంలోని మహేంద్రవాడ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో 2023 సంవత్సరానికి వినూత్నంగా స్వాగతం పలికారు. శనివారం పాఠశాల విద్యార్థులు 2023 ఆకృతిలో కూర్చుని కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.



రాజానగరంలోని పూలు, ఇతర స్టాల్స్ జనంతో కిటకిటలాడుతున్న దృశ్యం



బిర్యానీ పాయింట్ల వద్ద జనం

జీఎంఆర్ పాలిటెక్నిక్‌లో సర్టిఫికెట్ కోర్సులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి ఆధ్వర్యంలో ఆటోక్యాడ్, వెబ్‌డిజైన్, ఆఫీస్ ఆటోమేషీన్ సర్టిఫికెట్ కోర్సులు ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులకు సంబంధించిన తరగతులను పాలిటెక్నిక్ కళాశాలలోనే నిర్వహిస్తారన్నారు. మూడు నెలల ఈ కోర్సులకు పదో తరగతి, ఆపైన చదివిన వారు అర్హులన్నారు. ఒక్కొక్క కోర్సునకు ఫీజు రూ.6వేలు, 3 నెలలు శిక్షణ అనంతరం విజయవాడ ఏపీ రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి నిర్వహించు పరీక్షలో పాసైన వారికి సర్టిఫికెట్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కోర్సు సర్టిఫికెట్ పొందిన వారికి కేంద్ర, రాష్ట్ర, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. అర్హత, ఆసక్తి కల్గిన విద్యార్థులు కళాశాల మెకానికల్ డిపార్ట్‌మెంట్‌లో ఈనెల 7వ తేదీ శనివారం లోగా సంప్రందించి, తమ పేర్లను నమోదు చేసుకుని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు కోరారు.

ప్రజల ఆరోగ్య రక్షణకు ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న మేడా శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: పేపర్ మిల్లు విడుదల చేస్తున్న విష రసాయనాల నుంచి ప్రజల ఆరోగ్యాలకు రక్షణ కల్పించేందుకు ఉద్యమం చేస్తామని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరి ప్రాంత వాసులు పవిత్ర గోదావరి జలాలను పరిశుభ్రంగా తాగలేకపోతున్నారన్నారు. పాల్యూషన్ కంట్రోల్ బోర్డు నిమ్మకునీరెత్తి నట్లు వ్యవహరిస్తు, అవినీతి ముడుపులకు మార్గం చేసుకుంటుందని ఆరోపించారు. నగరపాలక సంస్థ ఎప్పటికప్పుడు వారి అసమర్థతను చాటుకుంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నగరం వస్తున్న సందర్భంగా గోదావరి ప్రాంత ప్రజల మనోభావాలను గుర్తెరిగి గోదావరి ప్రజల సౌకర్యార్థం, వారి ఆరోగ్య రక్షణ కోసం పేపర్ మిల్లు యాజమాన్యంపై అధికారిక చర్యలు చేపట్టాలని కోరారు. గోదావరి ప్రజల ఆరోగ్యాలకు భద్రత కల్పించకపోతే మిల్లు యాజమాన్యంపై ఉద్యమం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్‌ఫ్రీ ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎస్‌ఈబీ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక భాష్యం జూనియర్ కళాశాలలో డ్రగ్‌ఫ్రీ ఆంధ్రప్రదేశ్‌పై విద్యార్థులకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.వి.రమణ శనివారం అవగాహన కల్పించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో మత్తు పదార్థాల అమ్మకాలు, కొనుగోలు జరిగితే టోల్ ఫ్రీనంబరు 14500కు తెలిపి సహకరించాలన్నారు.

గోదావరి బాలోత్సవం లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, డీఈవో అబ్రహం తదితరులు

ప్రకాశం నగర్: విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యం, ప్రతిభాపటవాలను వెలికితీసేందుకు గోదావరి బాలోత్సవం ఒక చక్కటి వేదిక కాబోతుందని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఈఓ ఎస్.అబ్రహంతో కలిసి ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు సామాజిక బాధ్యతగా గోదావరి బాలోత్సవ కార్యక్రమం ద్వారా రాజమహేంద్రవరం నగరం, గ్రామీణ మండలాలకు చెందిన విద్యార్థులకు 56 అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్యశేఖర్, రాజు, విజయగౌరీ, చిలుకూరి శ్రీనివాస్, ఐ.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 17 మంది ఎంపిక

అభినందించిన కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): గ్రామ, వార్డు సచివాలయాల్లో నిరుద్యోగుల వివరాలు నమోదు చేస్తున్నారని కలెక్టర్ మాధవీలత తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వికాస ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు 78 మంది హాజరయ్యారని వారిలో 17 మంది వివిధ కంపెనీలకు ఎంపికైనట్టు తెలిపారు. ఆమె మాట్లాడుతూ యువతలో నైపుణ్యాభివృద్ధి పెంచేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇతర శిక్షణా సంస్థల ద్వారా చేపట్టే శిక్షణా కార్యక్రమాల మరింతగా పెంచేలా తీసుకుంటామని తెలిపారు. ఎంపికైన వారిని అభినందిస్తూ మరింత నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు.

మనసు మురిసేలా.. కళ్లు చెదిరేలా..

SUNDAY SPECIAL

- మంత్రముగ్ధుల్ని చేస్తున్న కోలాట ప్రదర్శన
- ప్రదర్శనతో కట్టిపడేస్తున్న కళాకారులు
- అపురూప కళారూపానికి టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఊపిరి
- వేలాది మందికి శిక్షణ



వెంకన్న గాలిగోపురం సాక్షిగా బాలికల కోలాట నృత్యోత్సాహం





కోలాట నృత్య ప్రదర్శనకు సిద్ధమవుతున్న బాలిక

సాక్షి అమలాపురం: ప్రజల జీవితాలతో పెనవేసుకుపోయిన అనేకానేక జానపద కళారూపాల్లో కోలాట నృత్యం ఒకటి. ఒకనాటి గ్రామీణ, పట్టణ ప్రజలకు అందుబాటులో ఉన్న వినోదాల్లో ఇదొకటి. ప్రతి పల్లెలో సాయంత్రం నుంచి రాత్రి పొద్దు పోయే వరకూ కోలాం ప్రదర్శిస్తూండే వారు. దేవుని పల్లకీతో వీధుల్లో తిరిగి ప్రతీ ఇంటి ముందూ కోలాటాన్ని భక్తిభావంతో ప్రదర్శించేవారు. తీర్థాలు, జాతరలు, దేవుళ్ల ఉత్సవాలు.. ఊరేగింపుల్లో కోలాట నృత్యం తప్పనిసరి. టీవీలు వచ్చిన తరువాత వీటి ఉనికి తగ్గిపోతున్నా.. ఇప్పటికీ పెద్దల్నీ.. పిల్లల్నీ కోలాటం ఆకట్టుకుంటూనే ఉంది. ఉనికి కోల్పోతున్న ఈ అపురూప కళారూపానికి తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యాన హరే శ్రీనివాస నిత్య కోలాట భజన మండలి దీనిని కొనసాగిస్తోంది. పిల్లలకు, యువతీ యువకులకు శిక్షణ ఇస్తూ కోలాటానికి జీవం పోస్తోంది.

సుదీర్ఘ చరిత్ర

- కోలాటానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. 'పండితారాధ్య చరిత్ర'లో పాల్కురికి సోమనాథుడు అనేక జానపద కళారూపాలను వర్ణిస్తూ కోలాటాన్ని 'కోలాట గొడియ' అని పేర్కొన్నాడు. విజయనగర సామ్రాజ్య కాలంలో కోలాటం ఒక వెలుగు వెలిగిందని పెద్దలు చెబుతారు. విజయనగర శిథిలాల్లో, శ్రీశైల దేవాలయ గోపురాలపై కోలాట నర్తకీమణుల శిల్పాలు ఉన్నాయంటారు.
- కోలాటానికి ఉపయోగించే చిడతల తయారీకి చేవ కలిగిన బిల్లుడు, చంద్ర, వేప, రేల, టేకు, ఏగిస తదితర జాతుల చెట్ల కర్రలను ఎంచుకుంటారు. వాటిని సరైన సైజులో కోసి, చక్కగా చిత్రీ పట్టి, పిడి వద్ద అందెలు, కోల చివర గజ్జెలనూ ఏర్పాటు చేస్తారు.
- కోలాటం ఆడేటప్పుడు వచ్చే ధ్వని మధురంగా వుంటుంది. ఆటగాళ్లందరూ కాళ్లకు గజ్జెలు కట్టుకుని, పాటకు లయబద్ధంగా ప్రదర్శన చేస్తారు.

అలాగే కోలాట బృందం మధ్యలో వాయిద్యకారులుంటారు. డోలక్, హార్మోనియం, తప్పెట, తాలు వంటివి కూడా వినియోగిస్తారు. పల్లెల్లో రైతులు, శ్రామికులు తమ రోజువారీ వ్యవసాయ, ఇతర పనులు ముగించుకుని సాయంత్రానికి ఇళ్లకు చేరుకుంటారు. వారు రాత్రి భోజనాలు చేసిన తరువాత కోలాట కళాకారులు తమ ప్రదర్శనలు ప్రారంభిస్తారు.

ఎన్నో రకాలు

కోలాట ప్రదర్శనలో పలు రకాలున్నాయి. ఒక్కో దానికి ఒక్కో గుర్తింపు.

బిందెల కోలాటం : గోపికలు శ్రీకృష్ణుని ముందు చేసిన నృత్యానికి రూపం.

మురళీ కోలాటం : శ్రీకృష్ణుడు గోపాలకులతో ఆడిన ఆటలు.

జెండాల కోలాటం : ఆంజనేయ స్వామి లంకా దహనానికి రూపం.

పాము కోలాటం : సుబ్రహ్మణ్యస్వామికి నృత్య రూపం.

హారతి కోలాటం : లోకం సుభిక్షంగా ఉండేందుకు నిర్వహించే నృత్యరూపకం.

జడ అల్ల కోలాటం : తిరుపతిలో అమ్మవారి జడలను పోలేటట్టు ఉండే నృత్యరూపకం.

కోలాటాన్ని తొలి రోజుల్లో పురుషులు చేసేవారు. తరువాత మహిళలు కూడా నేర్చుకున్నాక ఈ కళారూపం కొత్త కళను సంతరించుకుంది.

టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రోత్సాహం

కోలాటానికి టీటీడీ దాస్య సాహిత్య ప్రాజెక్టు ప్రోత్సాహమిస్తోంది. ప్రాజెక్టు కన్వీనర్ పగడాల ఆనంద తీర్థాచార్యులు ఆధ్వర్యాన గడచిన నాలుగు దశాబ్దాలుగా రాష్ట్రంలో 8 వేల కోలాట భజన కేంద్రాలు ఏర్పాటు చేశారు. కన్నడ నాట పురందరదాసు సంకీర్తనలు గ్రామగ్రామానా వినిపించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టు ప్రారంభించారు.

వృత్తి ఫొటోగ్రఫీ.. ప్రవృత్తి కోలాటం

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడుకు చెందిన బి.ఈశ్వర్ కోలాట నృత్యాన్ని ఇప్పటి వరకూ వందల మందికి నేర్పించాడు. చిన్నప్పుడు నేర్చుకున్న కోలాటం కళకు అంకితమైపోయాడు. ఒకవైపు ఫొటోగ్రఫీ వృత్తిలో ఉంటూనే.. మరోవైపు పట్టణాలు, పల్లెలకు వెళ్తూ కోలాటం నేర్పుతున్నాడు. ఇప్పటి వరకూ 50కి పైగా కోలాట భజన బృందాలకు శిక్షణ ఇచ్చారు. వీటిలో 70 నుంచి 100 మంది వరకూ శిక్షణ పొందిన వారున్నారు. తాజాగా అమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఈశ్వర్ కోలాటం నేర్పుతున్నాడు. అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు, అయినవిల్లి మండలం నల్లచెరువు, అమలాపురం పట్టణం, కామనగరువు వంటి ప్రాంతాల నుంచి పిల్లలు, యువతీయువకులు, మహిళలు 200 మంది వరకూ ఇక్కడ కోలాటంలో శిక్షణ పొందుతున్నారు. పర్వదినాలు, ఇతర ప్రధాన రోజుల్లో ఆలయం వద్ద వీరు నిర్వహిస్తున్న కోలాట నృత్య ప్రదర్శన భక్తులను, వీక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది.

నేను కూడా వదిలేస్తే ఎలా?



చిన్ననాటి నుంచీ కోలాటం నేర్చుకుంటున్నాను. ఈ కళ అంటే మక్కువ. దీనిని నలుగురికీ నేర్పాలి.. అందరికీ పంచాలన్నదే లక్ష్యం. నేను కూడా వదిలేస్తే ఎలా? ఈ కళకు నా వంతు సేవ చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాను. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు మాకు ప్రోత్సాహమిస్తోంది.

– జి.ఈశ్వర్



అమలాపురం శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో కోలాట ప్రదర్శన



బిందెల కోలాటానికి ఏర్పాటు









విద్యాభివృద్ధితో సమాజాభివృద్ధి

- వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ క్రొవ్విడి సర్రాజు
- విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



బూరుగుపూడిలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న దృశ్యం

మధురపూడి: విద్యాభివృద్ధి ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమవుతోందని వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ క్రొవ్విడి సర్రాజు అన్నారు. శనివారం బూరుగుపూడి హైస్కూల్లో ఎనిమిదో తరగతి 39 మంది విద్యార్థులకు ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సర్రాజు మాట్లాడుతూ రేపటి తరమైన విద్యార్థులపైనే సమాజభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. ఎక్కడైతే మంచి విద్యావిధానం ఉంటుందో, అక్కడే అభివృద్ధి ఉంటుందన్నారు. భవిష్యత్ తరాలకు మంచి విద్యనందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ పలు పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. ట్యాబ్‌లు అందించే కార్యక్రమం ద్వారా సాంకేతిక మార్పుకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్‌కు విద్యార్థులంతా రుణపడి ఉన్నారన్నారు. 39 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. కోరుకొండ హైస్కూల్, మునగాల యూపీ స్కూల్‌లో 120 విద్యార్థులకు జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు ట్యాబ్‌లు అందించారు. కోరుకొండ హైస్కూల్ హెచ్‌ఎం రాజానగరం ఇన్‌చార్జి ఎంఈఓ రామన్నదొర, బూరుగుపూడి హెచ్‌ఎం టి.సత్యనారాయణ, బూరుగుపూడి పీఏసీఎస్ ఛైర్ పర్సన్ బుడ్డిగ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు వాకా నరసింహారావు, కంటే సత్తిబాబు, పిట్టా కృష్ణ, అయిల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి విశేష అభిషేకాలు

పెదపూడి: వేంద్ర గ్రామంలో ప్రసిద్ధి చెందిన వేణుగోపాల స్వామి ఆలయంలో ధనుర్మాసం శనివారం సందర్భంగా రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామికి విశేష అభిషేక పూజలు చేశారు. ప్రముఖ వేద పండితుడు ఖండవిల్లి హనుమంతాచార్యుల అధ్వర్యంలో అర్చకుడు సత్య కృష్ణమాచార్యులు స్వామి, అమ్మవార్లకు తులసి, కుంకుమ పూజలు నిర్వహించారు అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోకవరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు స్థానిక ఏఎస్సై సత్యనారాయణ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...కోరుకొండ మండలం కూనవరం గ్రామానికి చెందిన పసుపులేటి కొండయ్య (30) వీరలంకపల్లిలోని ఇటుకల బట్టీలో పని చేస్తున్నాడు. డిసెంబర్ 26న బైక్‌పై శ్రీరంగపట్నం వెళుతుండగా అష్టలక్ష్మీ అమ్మవారి గుడి వద్ద బైక్ అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

4న పింఛన్ల పంపిణీ

బిక్కవోలు: మండలంలోని పింఛన్ లబ్ధిదారులకు 4వ తేదీన పింఛన్ పంపిణీ జరుగుతుందని ఎంపీడీవో జేఏ ఝాన్సీ శనివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన సీఎం జిల్లా పర్యటన సందర్భంగా 4న నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా అందజేస్తామన్నారు. ఈ విషయాన్ని లబ్ధిదారులు గమనించాలని ఆమె కోరారు.

చురుగ్గా డ్రైనేజీ నిర్మాణ పనులు

రంగంపేట: మండలంలోని కోటపాడులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామానికి మంజూరైన నిధులతో నిర్మాణం చేపట్టిన డ్రైనేజీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. శనివారం ఈ పనులను గ్రామ సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ, ఎంపీటీసీ సభ్యుడు సుంకర అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ సాయికుమార్‌తో కలసి పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణంపై పలు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ డ్రైన్ నిర్మాణం పూర్తయితే ఇళ్ల ముందు నిల్వ ఉంటున్న మురుగునీరు బయటకు పోతుందని దీంతో దోమలు దరిచేరకుండా ఉంటాయన్నారు. డ్రైనేజీ నిర్మాణంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు గవరసాని రాజు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల ఫీజు చెల్లింపు గడువు పెంపు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రైవేట్ జూనియర్ కళాశాలల గుర్తింపు ఫీజు గడువు తేదీ ఈనెల 4వ తేదీ వరకూ పొడిగించినట్టు ఇంటర్‌బోర్డు ఆర్‌ఐవో ఎన్ఎస్‌వీఎల్ఎస్ నర్సింహం శనివారం తెలిపారు. 2023–2024 విద్యా సంవత్సరంలో జూనియర్ కళాశాలలు అన్ని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించేందుకు ఈనెల 10వ తేదీ వరకూ గడువు పొడిగించినట్టు తెలిపారు.

శ్రీకృష్ణ అవతారంలో భజేనారాయణస్వామి

రంగంపేట: వడిశలేరులో కొలువైన శ్రీ, భూ సమేత భజేనారాయణ స్వామి వారి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని దశావతారాల్లో భాగంగా శనివారం స్వామిని శ్రీకృష్ణ అవతారంలో అలంకరించారు. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు స్వామిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై శ్రీకృష్ణ అవతారంలో ఉన్న స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం బుద్ధ అవతారంలో స్వామివారు దర్శనమిస్తారని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి ముమ్మన రాంబాబురెడ్డి తెలిపారు. సోమవారం వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) పర్వదినం సందర్భంగా ఆ రోజు వేకువజాము నుంచి స్వామివారు ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని అనంతరం మధ్యాహ్నం గ్రామోత్సవం నిర్వహిస్తామని స్వామివారి దర్శనంకోసం వచ్చే భక్తులకు అన్ని విధాలా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మావిరెడ్డి నెహ్రూ, ధర్మకర్తల మండలి సభ్యులు, గుమస్తా హనుమంతు పాల్గొన్నారు.















